# ఆగం బతుకు

**ఎమ్మెల్యేగా** ఏకగ్రీవంగా ఎన్నికైన అభ్యర్థి మొహంలా వీధి దీపాలు వెలిగిపోతున్నై. ... ఇంకా కొద్దిసేపైతే తెల్లారిపోతది. వీధిలైట్ల బతుకు గూడా తెల్లారిపోతది. గంత మాత్రానికి గింత ఎలుగెందుకో ! దేవుడు మనిషిని ఆడించినట్టు మనిషి కరెంటు నాడిస్తున్నాడు... పనిలో లీనమైన మున్సిపల్ స్వీపర్ బాలమణి నుదుటి మీద చెమట బిందువులతో పరాచకాలాడుతున్న ముంగురుల్ని సవరించుకుంది. చేతులున్న చీపురు రోడ్డు మీద ఆగకుండా చిందులేస్తూనే ఉంది. పాతికేళ్ల అనుభవ పటుత్వం - వంచిన నడుమును ఎత్తనివ్వడంలేదు. అలా ఊడుస్తూ గుడి ముందుకు రాగానే మరో ఆలోచన...

రోజూ బ్రహ్మ ముహూర్తంలో నిద్రలేవాలి. ఇంటిపని, ఒంటి పని ముగించుకుని నాలుగింటికల్లా మున్సిపలాఫీసు మొహం చూడాలి. హాజరివ్వాలి. తట్టా, చీపురు పట్టుకుని రోడ్డుమీదికి రావాలి. ఆలస్యమైతే దరోగా (ఇన్‌స్పెక్టర్) సాబ్‌కు కోపం... కోడెనాగు లెక్క బుస్సుబుస్సుమంటడు - తిట్టిపోస్తడు. నలుగురి ముందు నవ్వులపాలు గావాలె. ఓ రోజు జీతం కోసిపారేస్తడు. గదంతా కతెందుకనుకుంటే - పక్కనుంచి వొయ్యి పదిమందికి దెల్వకుంట పది రూపాయల నోటు చేతుల వెట్టాలె... చూసీ చూడనట్టే పోతడు.

గివన్నీ కతలెందుకూ... టయానికి డ్యూటీకొస్తే సరిపాయె. పొద్దు పొడవక ముందే రోడ్లన్నీ శుబ్బరంగా ఊడ్వాలి. అయినా... ఎంత అద్దమోలే ఊడ్చినా ఏం లాభం ? పొద్దుగూకె సరికి రోడ్ల నిండా పాట్లాల కాయితాలు, పోరగాండ్ల మలమూత్రాలు... ప్చ్... అన్నీ అక్కడనే. ఊడ్చుడై పోంగనే ఆఫీసు కెళ్ళి మళ్ళీ హాజరిస్తే డ్యూటీ ఐపోతది. ఇంటికాడ కూతురు ఇందిర ఉంది గదా! కూడువండి పెడ్తుంది. ఇంటికి పోంగనే స్నానం గీనం జేసి ఇందిర తోని ముచ్చట్లు పెట్టుకుంట తినొచ్చు. తినంగనే ఇందిర కాలేజికి పోతదాయె... రోజువారీ కార్యక్రమాన్ని నెమరేసుకుంటూ బాలమణి రోడ్లతో పాటు మనసును గూడా శుభ్రపరచుకుంది. ఊడ్చిన చెత్తలోంచి కాయితాలు వేరుచేసి కుప్పగా చేసి అగ్గిపుల్ల గీసి అంటించింది. చెత్తనంతా తట్టలోకెత్తి కుండిలో పడేసింది. అప్పటికే ఆయాసం మొదలైంది. ఏందో మాయ ! మనిషి చెయ్యని తప్పుకు దేవుడు వేసే పెద్ద శిక్ష ముసలితనం... అనుకుంటూ చేతులు దులుపుకుంది. ఒళ్ళంతా చెమట వాసన. బజారు బోరింగ్ కాడ కాళ్ళూ చేతులు కడుక్కుంటోంది.

'పెద్దమ్మా... పెద్దమ్మా !' ఇంటిపక్క అరుణ బాణంలా దూసుకొచ్చింది. వైసుపిల్ల... దమ్ముదీస్తుంటే వోణీ చాటున ఛాతీ ఎగిరిపడ్తోంది.

"ఏంది ? ఏమైందే అరుణా ? గట్ల ఎగవోసుకుంట వచ్చినవెందుకూ ?"

"ఇందిరక్క ఇంట్ల లేదు. రోజూ మబ్బుల్నే లేచి వంటజేసేది గదా ! ఇయ్యాల్ల చడీచప్పుడు లేదని మీ ఇంట్లకు వోయిన. ఇంట్ల లైట్లు ఎలుగుతున్నై. ఇందిరక్క లేదు. బయటి తలుపులు గొల్లెం బెట్టున్నై..."

గుండెల్లో గులకరాయి దొర్లింది.

రోజూ తను డ్యూటీకొచ్చేప్పుడు నిద్రలేస్తది. పుస్తకం పట్టుకుంటది. చదువుకున్నంక తన పనులు జేసుకుని వంటజేస్తది. ఇయ్యాల్ల గూడా నిద్రలేచింది... మరేమైందబ్బా ! ఎటు వోయిందీ ? ఆ... ఎటు వోతదీ !

'ఓర్ని ... పిచ్చిదానా ! లోపల మొకం గికం కడుక్కొని స్నానానికి వోయిందేమో బిడ్డ !' నవ్వొచ్చింది.

'కాదు పెద్దమ్మా ! బాత్రూంల జూసిన, వంటింట్ల జూసిన. మంచమ్మీద జూసిన. ఇల్లంత జూసిన. ఇందిరక్కలేదు. నాకు దడుగ్గుమన్నది...'

మాంచి వైసులున్న ఇందిర ఏమైతదీ ! ఎవడన్నా మాయమాటలు జెప్పి, మచ్చుజల్లి... వామ్మో ! నరాలను దబ్బనాలతో పొడిచినట్లైంది. అనుకోకుండా దరోగా వస్తున్నాడటు వైపు. బాలమణి కొంగు సర్దుకుంది.

'సార్ ! నాకు జల్దీ పనుంది. నేనింటికి వోతున్న. జెర హాజిరేసుకో....' చేతులు జోడించింది. ఎవరో వెంటబడి తరుముతున్నట్టు పరుగులాంటి నడకతో ఇల్లు చేరింది.

తలుపులు తెరిచే ఉన్నాయి. లైట్లింకా వెలుగుతున్నై. స్నానాల గది, వంటగది, పడగ్గది, పుస్తకాల టేబుల్.. అణువణువూ దృష్టి సారించింది. ప్రాణంలేని వన్నీ ఎక్కడివక్కడున్నాయి కాని ప్రాణ సమానమైన కూతురు పత్తాలేదు. వెన్నుపూసలోంచి సన్నని వణుకు పుట్టుకొస్తుంది. దండెమ్మీద ఇందిర పాతడ్రెస్సుంది. బీరువా తెరిచి ఉంది. కాళ్ళు వోయి కడుపుల జొచ్చినై. తనకు చెప్పకుండా ఇందిర ఎన్నడూ బయటికెళ్ళదు.

'అయ్యో ఇందిరా... ఎటువోతివే. ఏం జేస్తివే' దబదబ తలబాదుకుంది. గుడ్లల్ల నీళ్ల దిరిగినై. గట్టిగా ఏడ్వాలన్పించింది. ఏదో అగాధం... పిచ్చి పట్టినట్టనిపించింది. బీరువా వెతికింది. పట్టుచీర, బంగారు గాజులు అట్లానే ఉన్నాయి. అయోమయం.

మరెటు వోయిందబ్బా ! ఉహూ ! పోరి లేచిపోలేదు. నా చేతితోని పాలబువ్వ తిన్నది. మల్లెపూవోలె పెరిగింది. నవ్వుతూ, నవ్విస్తూ మురిపాలు ఒలకబోసింది. పెంపకములో లోపమేమన్నా ఉందా ? ఉహు, కానీ... ఏమో ?! గతం నీలినీడలు కళ్ళల్లో కదులుతున్నాయి.

.... ఆనాడు హఠాత్తుగా మరణించిన భర్త స్థానంలో తనకు మున్సిపల్ ఉద్యోగమొచ్చింది. అత్తింటోల్లు, పుట్టింటోళ్లు దిక్కులేరు.

అలవాటు ప్రకారం... ఆ రోజు గూడా రోడ్లు ఊడ్వడం పూర్తయింది. చిత్తుకాయితాల కుప్పకు అగ్గిపుల్ల గీసి పెట్టింది. తట్టల చెత్తను కుండీలో పారెయ్యబోయింది. ఆశ్చర్యం...

కుండీలోంచి కేర్‌కేర్‌మని వినబడింది. తొంగి చూసింది. ఆడపిల్ల... గుడ్డలో చుట్టబడి... గుక్క పట్టి ఏడుస్తోంది. అటూ ఇటూ చూసింది.

ఎవ్వరూ కనబడలేదు. ఆనందం... పట్టరాని ఆనందం... కరెంటు పోయిందప్పుడే. వీధి దీపాలారిపోయినై.

నీ యవ్వ... గీ కరంటు గిప్పుడే పోవాల్నా... విసుక్కుంది.

అయ్యో దేవుడా ! పసిగుడ్డును పెంటల పారేసిన పాపాత్ములెవరో ! కండలల్ల, కండ్లల్ల కావురమొచ్చి... కనిపారేసిన తల్లిదండ్రుల తప్పుకు ఈ పసిగుడ్డును కుక్కలు పీక్కుతినాలెనా?... కడుపులో సప్తసముద్రాలు పొంగినై. పొత్తిళ్లపాపను పూవులా లేవనెత్తి గుండెలకు హత్తుకుంది. కాలిపోతున్న చిత్తుకాయితాల వెలుగులో చూసింది. పాప ఏడుపు మానేసి కాళ్లూ చేతులాడిస్తుంది. చెయ్యి నోట్లో వేసుకుంది. ఒంటి నిండా రక్తం మరకలు. మరోసారి గుండెలకు హత్తుకుంది. బాధతో బండబారిన గుండెల్లో ఏదో తేమ... ఏదో ఆశ... తన భవిష్యత్తు ఆశాదీపం... ఒళ్ళంతా ముద్దులతో నింపేసింది. మాతృత్వం పొంగుల నాపుకోలేక... ఇంటికి తీసుకెళ్ళి కడిగింది. పసిగుడ్డును భర్త ఫోటో ముందుంచి దండంబెట్టింది.

'నువు స్వర్గంబోయి దీన్ని నా కోసం పంపించినవు గదా ! మోటకేసిన మొద్దు లెక్క ఒంటరిదాన్నై పోయిన్నని నాకో తోడు పంపినవు గదూ ! ఇది నా బంగారు కొండ. దీన్ని పెంచుతా... దీని పేరు ఇందిర... ఆ... దీని పేరు.. ఇందిర... బాగుంది గదా ! ఇది నా ప్రాణం... ఊహల్లో ఊగిపోతూ లేతబుగ్గల మీద ముద్దులు వడ్డించింది. ఎంత హాయో... తననుతాను మరిచిపోయింది.

'దేవుడా... ఇంతకంటే నాకింకేమీ వద్దు. ఈ పాప నాది. నా సొంతం... పాలు పడుతూ పరవశించిపోయింది. 'అమ్మా !' అంటూంటే ఆత్మ పులకించింది. తప్పటడుగులు వేస్తూంటే తానూ చిన్నపిల్లై గంతులేసింది. రెక్కలు ముక్కలైనా సరే ఒక్కగానొక్క కూతురును చక్కగా చదివించాలనకుంది. తాను కన్నతల్లి కాదన్న సంగతి ఇందిరకు తెలవకుండా జాగ్రత్తపడింది. కంటికిరెప్పలా కాపాడింది. చదువుతోపాటు సంస్కారం నేర్పే స్కూల్లో చేర్పించింది.

నా బిడ్డ బుద్ధిమంతురాలు, నేనెంత జెప్తే గంత. గర్వపడింది. ఇందిర పెద్దమనిషైనప్పుడు మున్సిపల్ వర్కర్లందరికీ విందుభోజనం పెట్టింది.

పడుచుదనం పాలపొంగనీ, వయసొచ్చిన ఆడపిల్ల ఇంట్లనే ఉండాలనీ ఇరుగుపొరుగు చెప్పినా వినకుండా కాలేజికి పంపించింది... ఇంగ గీ ఒక్క సంవత్సరమైతే గా డిగ్రీ చదువై పోతది. దోరమాగిన దోసపండోలె తయారైంది. దాన్నో దొరబాబుకిచ్చి పెండ్లి చెయ్యాలె... దాని పిల్లల్తోని ఆడుకోవాలె...

'అయ్యో బిడ్డ ఇందిరా ! నా కడుపుల చిచ్చు వెడ్తవా బిడ్డా... అయ్యయ్యో....' బోర్‌మంది. ఇరుగుపొరుగు ఇల్లంతా నిండారు కొందరు పాపమన్నారు. మరికొందరు దవడలు నొక్కుకున్నారు.

'దొర వయసులున్న పిల్లను ఇంటి మీదుంచుకుంటే ఇంగులాలు కొంగుకు కట్టుకున్నట్టే గదా !' మూతులు చేతులు మూడు వంకర్లు తిరిగినై.

'పెండ్లిజేస్తే ఇద్దరు పిల్లల తల్లయేది...' ముక్కుల మీద వేళ్ళు.

'పిల్ల మంచిదే కాని... వాగులెక్క ఉరుకులాడుతున్న వయసు ఊకుంటుందా?' దీర్ఘాలు. వ్యాఖ్యానాలు చెవిగూబలకు తూట్లు పొడుస్తున్నై. అలాగే గోడ కొరిగి మోకాళ్లలో తలదూర్చి ఏడుస్తూనే ఉంది బాలమణి.

'బాలక్కా!' ఊపిరి పీల్చుకుని సముదాయింపునుకు దిగింది. 'పిల్ల కనబడ్తలేదని గట్ల లొల్లి జేసుకుంటే బాగుంటదా ? లెవ్వు... వెతుకుదాం పదా !' భుజాలు పట్టి లేపి తనవెంట తీసుకెళ్ళింది.... అరుణ తల్లి దుర్గమ్మ.

చాలాచోట్ల వెతికారు. తెలిసినవాళ్ళనడిగారు. సూర్యుడు నడినెత్తి మీదికొచ్చేదాకా వెతుకులాట. దుర్గమ్మ ఇంటికొచ్చేశారు. బాలమణి కళ్లల్లో ఇందిర రూపమే కదలాడ్తోంది. ఇందిర బతికుంటే గింతసేపు నన్ను చూడకుండా ఉంటదా... ! కడుపులో చల్లజేసి నట్లైంది.

'అయ్యో బిడ్డా... ! మల్లా నా బతుకు ఆగమై పోయిందే ! నిన్ను జూస్కొని బతుకుతున్న బిడ్డా ! ఇప్పుడెవల కోసం బతకాలె బిడ్డా ? ఏం జూస్కొని బతకాలె బిడ్డా ! శోకాలు దీసింది. దుర్గమ్మ కడుపులో కలకలం. ఆమెగ్గూడా దుఃఖమాగలేదు. తానూ శృతి కలిపింది. అరుణ కూడా గొల్లుమంది. కాస్సేపయ్యాక... తాను తప్పుజేస్తున్నాననిపించింది దుర్గమ్మకు. తనను తాను సంబాళించుకుని అరుణను మందలించింది.

బాలమణిని లేపి బలవంతంగా కాళ్ళూ చేతులు కడిగించింది ఇద్దరికీ వేడి వేడి అన్నం వడ్డించింది అరుణ. బాలమణికి కూర వడ్డిస్తూ...

'పెద్దమ్మా ! నువ్వేం ఫికరు జెయ్యొద్దు. పరేషాన్ కావద్దు...' అనునయించబోయింది.

'పరేషాన్‌గాక ఇంకేముంది బిడ్డా ?' బాలమణి గొంతు బాధామయమైంది. గుండెల మీదికొచ్చిన పొడగాటి జడను సవరించుకుంది అరుణ.

'కాదు పెద్దమ్మా. ఇందిరక్క చాలా మంచిది. చెడ్డ బుద్ధుల్లేవు, బేకార్ దోస్తుల్లేరు...'

'నీయవ్వ ! గిదేందే బాలక్కా ? గా పోరికి ఓ చెంపగొడ్తే పాలు, ఇంకో చెంపగొడ్తే నీళ్ళు. నువ్వేమీ ఆగం గావద్దు. తినంగనే మనం సక్కగ పోలీస్‌స్టేషన్‌కు వోదాం. హెడ్ కానిస్టేబుల్ మా తమ్ముడున్నడు. కేసు గీసు రాయడు. గప్‌చుప్‌గ వెతికిస్తడు. ఓర్నీయవ్వ... గిట్ల వైసులున్న పిల్లలు మాయమైతే... ఇదేమన్నా అడివా?' ధైర్యం నూరిపోసింది. అయినా ఒక్క ముద్ద గూడా తినిపించలేక పోయింది.

కడుపుతీపి మా పెడ్డది. పేగు ప్రమేకంటే పెంచిన ప్రేమ గొప్పదంటరు. పాపం బాలక్క ! పసిగుడ్డును దెచ్చి పాలువట్టె. కన్నతల్లి కంటె మిన్నగా కంటికి రెప్పోలె కాపాడుకుంది... దుర్గమ్మ లోలోపల బాధ. అయినా పైకి గంభీరంగా ఉంది.

'చూడు బాలక్కా ! కడుపుల ఆసరా ఉంటే కైలాసంల కొట్లాడొచ్చు. కడుపుల ఆకలి గోకుతుంటే నీ బిడ్డనెట్లా వెతుకుతవ్ ? దాని కడుపు సల్లగుండ. ఎక్కడుందోగాని దొర్సానోలె ఉండొచ్చు. నువ్వే ఆగమై పోతున్నవు. ఎక్కడన్నా తప్పిపోయే తందుకదేమన్నా చిన్న పోరా చితకపోరా ? ఏలువెడితె కొరకదా, ఎన్నవెడితె నాకదా ?'

'చిన్నపిల్లయితే గింత ఫికరుండది. వైసొచ్చినపిల్ల. లడ్డోలున్నది. ఎవడన్నా ఎత్తుక పోయిండేమో... నా కడుపు కలికలై పోతుందవ్వా ?'

"దుర్గక్కా... ఓ దుర్గక్కా !" గడప మీద పోలీసు లాఠీ టకటకలాడింది. పోలీస్ కనపడగానే బాలమణి కడుపులో డప్పులు కొట్టినట్లైంది.

'అగ్గో ! మా తమ్ముడు హెడ్కానిస్టేబులొచ్చిండు' దుర్గమ్మ దిగ్గున లేచింది. 'రారా తమ్మీ, నీకు నూరేండ్లురా...'

'అంటే... నాకు నూరేండ్లు నిండినయా ? నీ యవ్వ... ఇంగ నేను సచ్చిపోయినట్టేనా ?' లాఠీ చంకలోకెళ్ళింది. ఎడమచేతి ఎర్రటోపి తియ్యగానే కుడిచెయ్యి తలగోకింది. మర్యాదగా నుంచుంది బాలమణి. ఇప్పుడు వీడెందుకొచ్చినట్టూ... దుర్గమ్మలో అనుమానం.

'ఛీ ! గట్లగాదురా, నీకు నిండ నూరేండ్ల ఆయుష్షుంటది. ఇప్పుడే నిన్ను గుర్తు జేసుకుంటున్నా.'

పోలీస్ బుర్రలో లైటు వెలిగింది. 'ఓహ్ గట్టనా !' మొహం వికసించింది. టోపీ యధాస్థానంలో ఉంచేస్తూంటే నల్లని మీసాల కింద తెల్లని చిరునవ్వు చిందులేసింది. నేను గూడా కావాలనే ఇంటికొచ్చిన...'

"ఎందుకూ ?"

'ఎందుకుంటే... గా బాలమణి నీతోనే మున్సిపాల్టిల పంజేస్తదట గదా ! ఆమె కోసం పొద్దుట్నుంచి తిరుగుతున్నా...'

'ఎందుకురా ? గీమెనే బాలమణి' చూపించింది.

'గట్లనా ? గీమె బిడ్డనే గదా ఇందిర'

'అవును. నా బిడ్డనే' బాలమణిలో భయం, ఆనందాశ్చర్యాలు కలెగలుపుకొచ్చినై. 'ఇప్పుడెక్కడుందన్నా !' గాబరాగా అడిగింది.

'ఓర్నియవ్వ... నువ్వేనా ?'

'అవునన్నా ! నా బిడ్డకేమైందన్నా ?' వణికిపోతోంది.

'పోగాలమొచ్చింది' మళ్ళీ నవ్వాడు.

'హామ్మో... వాయ్యో ! ఏమైందన్నా ?' ఛాతీమిద దబదబ బాదుకుంది బాలమణి. మనసేదో కీడు శంకిస్తోంది.

'ఛూ...నీవ్వ ! గీ ఆడోళ్లు ఉట్టిగనే భయపడ్తరు. నీ బిడ్డ పెండ్లి జేసుకుని అత్తగారింటికి పోయే కాలమొచ్చిందన్న మాటా !'

ముగ్గురాడవాళ్ల మొహాలు ప్రశ్నార్థకాలైపోయినై.

'నీ నవ్వు నాశనంగాను, పోరెక్కడుందో చెప్పురా !' దుర్గమ్మ ఝాడింపుకు దిగింది. 'దాని కోసం మేము ఊరంతా గాలించినం. ఇప్పుడే పోలీస్‌స్టేషనుకు రావాలనుకున్నం...'

పరిస్థితి తీవ్రత హెడ్ కానిస్టేబుల్ కర్థమైంది.

'పొద్దుగాల్ల ఇందిరను నేనే తీస్కపోయిన్నే దుర్గక్కా...'

హమ్మయ్య... నా ఇందిర బతికే ఉంది... బాలమణికి బలమొచ్చింది.

'గా పోరి ఏం తప్పుజేసిందని పట్టుకపోయినవన్నా ?'

'అయ్యో... పట్టుక పోలేదవ్వా. తీసుకుపోయిన. నువ్వు లేవు'

'ఎందుకు మావయ్యా ?' అరుణ క్కూడా కోపమొచ్చింది. ఒంటిరాయి ముక్కుపుడక చమక్కుమంది.

'మా టూనాట్‌ఫోర్ కానిస్టేబుల్ చెప్పలేదా?'

'నాకెవ్వలు ఏమీ చెప్పలేదన్నా'

'గట్లనా ?' హెడ్డు హెడ్డులో రంగులు మారినై. 'వాడు ఏ పిక్‌పాకెటర్ వెంటున్నడో, దొంగ నా కొడుకు...' లాఠీతో నుదురు కొట్టుకున్నాడు. ముగ్గురాడవాళ్ళు మొహాలు చూసుకున్నారు.

ఉత్కంఠ, వత్తిడితో మెదడు నరాలు తెగేట్టున్నై. హెడ్డు గొంతు పిసికెయ్యాలన్నంత కోపమొస్తుంది.

'మరెందుకు దీస్కపోయినవన్నా ?' బాలమణి నెత్తికొట్టుకుంది. 'చెప్పన్నా...' గొంతు కీచుమంది.

'ఇంగో... కొత్తగొచ్చిన మా యస్సై పెండ్లిగాని పిల్లగాడు' డ్రెస్సు సర్దుకుని కుర్చీలో కూర్చున్నాడు. 'శాన మంచిగుంటడు. ఎర్రబుర్రగ మాగిన మామిడి పండోలుంటడు...'

'నీయాలి ముండవొయ్య' దుర్గమ్మ తనను తాను సంబాళించుకోలేక పోయింది. ' ఆ యస్సై ఎట్లుంటే మాకెందుకురా ?'

'నీ యవ్వ ఇను... పూర్తిగ విను' హెడ్డు గుడ్లురిమాడు. 'ఇందిర నోసారి యస్సై లైబ్రరీల జూసిండట. ఏదో పుస్తకం గురించి ఇద్దరూ మాట్లాడుకున్నరట. గట్లే చాలసార్లు... ఎక్కడెక్కడో కల్సుకున్నరట. ఇందిర, యస్సై ప్రేమించుకున్నరటా... మా యస్సై తల్లిదండ్రుల్ని పిలిపించిండు. వాళ్ళేమో... మంచి ముహూర్తముందని ఇయ్యాల్ల పొద్దుగాల్లనే ఇందిరను చూస్తమన్నరట. తెల్లారక ముందే నన్ను పిలిపించి చెప్పిండ్రు. మా ఇంట్లనే పెండ్లిచూపులేర్పాటు జేసిన. నీకు జెప్పి ఇందిరను తీస్కపోవాలని గంత పొద్దుగాల్లొస్తే... నువు లేవు. ఇందిర రానన్నది. నేనే నచ్చజెప్పిన. ఆ పిల్ల ఇంట్ల లైట్లు గూడా బంద్ జెయ్యకుంట వచ్చింది. గీ సంగతి నీకు జెప్పుమని, నిన్ను గూడా అక్కడికి తీస్కరమ్మని మా టూనాట్‌ఫోర్ గానికి జెప్పిన. ఇందిరమ్మ బంగారబొమ్మ.

అందరికీ నచ్చింది. నువ్వేమో ఇగ రావు. అగ రావు. టూనాట్‌ఫోర్‌గాడు పత్తాలేడు. ఇందిరనేమో... మా అమ్మ ఇష్టమంటుంది. మా యస్సై తల్లిదండ్రులు ఇందిరను ఇడిచిపెడ్తలేరు. మనమక్కడికే పోదాం పదండి...'

కొండలోయలో పడిపోయి సురక్షితంగా పైకొచ్చినట్టు ఊపిరి పీల్చుకున్నారంతా.

'నిజంగానా !' బాలమణి సంభ్రమాశ్చర్యాల్లో మునిగింది. కానీ... దాని పుట్టుపైర్వోత్తరాలు వాళ్లకు ముందుగాల జెప్పాలె...'

'అవును. అంత్య నిష్టూరం కంటే ఆది నిష్టూరం మేలు' దుర్గమ్మంది.

'అవన్నీ ఇందిరనే చెప్పింది. ఇందిర బాలమణికి చెత్తకుండల...'

'అయ్యో... రామ !' బాలమణి బేజారైంది. ' ఆసంగతి దానికెట్లా దెల్సటా ?'

'రామా లేదు. దోమా లేదు. మా యస్సై, వాళ్ళ తల్లిదండ్రులు మాకు పిల్లనే ముఖ్యం, పుట్టుపైర్వోత్తరాలతో సంబంధం లేదన్నరే దుర్గక్కా. ఇంగ పదండి' తొందర చేశాడు హెడ్ కానిస్టేబుల్.

'ఆ సంగతి ఇందిరకు నేనే ఓసారి జెప్పిన' బాలమణి కళ్లలోకి చూసింది దుర్గమ్మ. 'చెప్పినంక ఏమన్నదో తెల్సా ?' దుర్గమ్మ కనుబొమలు పైకిలేచినై. బాలమణి దుర్గమ్మ చేతులందుకుంది.

"ఏమన్నది ?"

'మా అమ్మ దేవత... అన్నదక్కా....' సంతోషాన్నాపుకోలేక బాలమణి చేతుల్ని ముద్దాడింది. బాలమణి మొహం బంతి పూవైంది.

'ఆనందమానందమాయనే. మా ఇందిరక్క పెళ్ళికూతురాయెనే...' అరుణ లేడిపిల్లలా గంతులేసింది. 'నేను గూడా వస్తా, మా యస్సై బావను జూస్తా'.

**19 ఆగష్టు 2001**
**ఆదివారం 'ఆంధ్రభూమి'లో**
**ప్రచురితమైంది.**



